క్లుప్తంగా

మాల ఎమ్మెల్యేలు నిరసన తెలపాలి



నిరసన తెలియజేస్తున్న మాల మహానాడు నాయకులు

కదిరి అర్బన్: కూటమి ప్రభుత్వంలో ఉన్న మాల ఎమ్మెల్యేలు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలియజేయాలని మాల మహానాడు నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఎస్సీ వర్గీకరణపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో మాలల కంటే మాదిగలకే ఎక్కువ నష్టమన్నారు. ఈ ప్రభుత్వం రిజర్వేషన్ ఫలాలు మాలలకు అందకుండా కక్ష పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు రామచంద్ర, శ్రీనాథ్, మధుసూదన్, త్యాగరాజు, సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

బెట్టింగ్‌తో జీవితాలు నాశనం



తనకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

తనకల్లు: క్రికెట్ బెట్టింగ్‌తో పాటు ఆన్‌లైన్ బెట్టింగులతో జీవితాలు నాశనమవుతాయని ఎస్‌ఐ గోపి అన్నారు. మండలంలోని కొక్కంటి క్రాస్‌కు చెందిన పలువురు యువకులు శనివారం తనకల్లు లోని పోలీస్‌స్టేషన్ వరకు బెట్టింగ్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఐపీఎల్ క్రికెట్‌లో బెట్టింగ్ పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో ఎవరైనా ఎలాంటి బెట్టింగ్‌కు పాల్పడినా వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. బెట్టింగ్‌కు వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టిన యువకులను ఆయన అభినందించారు.

బెట్టింగులకు పాల్పడితే చర్యలు తప్పవు

పుట్టపర్తి టౌన్: ఐపీఎల్ నేపథ్యంలో పుట్టపర్తి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ విజయకుమార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బెట్టింగుల జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి



కుర్లి ఆర్‌ఎస్‌కేలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ షాదాబ్

తలుపుల : మండలంలోని ప్రతి రైతు రైతు సేవా కేంద్రాల్లో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ షాదాబ్ సూచించారు. శనివారం ఆయన మండలంలోని కుర్లి, ఓదులపల్లి, ఉడమలకుర్తి రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో రికార్డులను, విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై వీఏఓలతో ఆరా తీశారు. మండలంలో 11,730 మంది రైతులుండగా 8448 మంది రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకున్నట్లు తెలిపారు.

‘ఉపాధి’లో రూ.7.42 లక్షల అవినీతి



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

ముదిగుబ్బ: మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.7.42 లక్షల అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం తేల్చింది. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీపై ప్రజావేదిక(బహిరంగ సభ) ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా తనిఖీ బృందం సభ్యులు గ్రామాల వారీగా తనిఖీ వివరాలు వెల్లడించారు. మండలవ్యాప్తంగా 2023–24 సంవత్సరానికి గాను రూ.15.88 కోట్ల ఖర్చు చేయగా అందులో రూ.7.42 లక్షల అవినీతి జరిగినట్లు తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. బాధ్యుల నుంచి సదరు మొత్తాన్ని రికవరీ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎంపీపీ ఆదినారాయణ, ప్రెసెడింగ్ ఆఫీసర్ శివ శంకర్, ఏపీడీ వెంకటాచెలపతి, అంబుడ్స్‌మెన్ వెంకట శివారెడ్డి, ఎంపీడీఓ దివాకర్, ఏపీఓ రమణారెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ హర్షణీయం

ఓడీచెరువు: ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో ఆమోదం పొందడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు బావన్న, లక్ష్మన్న, రమణ, కత్తి ఆనంద్ పేర్కొన్నారు. శనివారం వారు మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి వద్ద మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు పలక గంగన్న, శ్రీనివాసులు, ఎర్ర దొడ్డప్ప, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు

క్యారెట్... నో రేట్!



ఉప్పార్లపల్లి వద్ద ధర లేకపోవడంతో క్యారెట్ పంటను తొలగిస్తున్న రైతులు



ఉప్పార్లపల్లి వద్ద పొలాల్లోనే వదిలేసిన బీట్‌రూట్ పంట

- అమాంతం పడిపోయిన ధర
- కిలో రూ.3 పలుకుతున్న వైనం
- బీట్‌రూట్‌దీ అదే పరిస్థితి
- ధర లేకపోవడంతో పొలాల్లోనే పంటను వదిలేస్తున్న రైతులు

తనకల్లు: ఎన్నో ఆశలతో కష్టపడి సాగు చేసిన క్యారెట్ పంట రైతులను నిలువునా ముంచింది. ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో క్యారెట్‌ను సాగు చేసిన రైతులు భారీగా నష్టపోయారు. గతేడాది క్యారెట్‌ను సాగు చేసిన రైతులకు మంచి లాభాలు రావడంతో ఈ ఏడు మండలవ్యాప్తంగా సాగు విస్తీర్ణం పెరిగింది. మండలంలోని ఈతోడు, ఉప్పువాండ్లపల్లి, బిళ్లారివాండ్లపల్లి, గంగసానివారిపల్లి, కొండవెనుకపల్లి, తనకల్లు, రాకుంటపల్లి, మండ్లిపల్లి తదితర గ్రామాల్లో దాదాపు 800 ఎకరాలకు పైగానే క్యారెట్‌తో పాటు బీట్‌రూట్‌ని రైతులు సాగు చేశారు. దిగుబడి బ్రహ్మాండంగా వచ్చింది. అయితే ప్రస్తుతం మార్కెట్లో ధరలు పతనమవడంతో పంటను కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో సాగు చేసే క్యారెట్, బీట్‌రూట్‌ను ఎక్కువగా కర్ణాటక, తమిళనాడులోని పలు మార్కెట్లలో విక్రయిస్తారు. పంట పొలంలో ఉండగానే కర్ణాటకకు చెందిన వ్యాపారులు రైతులకు ముందుగానే అడ్వాన్సులు ఇచ్చి పంటలను కొనుగోలు చేసేవారు. అయితే ప్రస్తుతం క్యారెట్, బీట్‌రూట్‌ని కొనుగోలు చేస్తామని అడిగేనాథుడే లేడని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు రూ. లక్ష వరకు నష్టం..

క్యారెట్, బీట్‌రూట్‌ని సాగు చేయడానికి రైతులు విత్తనాలు, ఎరువులు, మందులు అన్ని కలిపి ఎకరాకు దాదాపు రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. పంట దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో వచ్చింది. ఎకరాకు 12–15 టన్నుల వరకు దిగుబడి రావడంతో మంచి లాభాలు ఉంటాయని రైతులు ఆశించారు. అయితే ప్రస్తుతం కర్ణాటక ప్రాంతంలోనూ క్యారెట్, బీట్‌రూట్ దిగుబడి బాగా వస్తుండడంతో అక్కడి వ్యాపారులు ఇక్కడ పండిన పంటను కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో ధరలు పడిపోయాయి. నెల రోజుల క్రితం కిలో రూ. 15 నుంచి రూ. 20 ధర పలికిందని, అయితే ప్రస్తుతం కిలో కేవలం రూ. 3లకు మాత్రమే కొనుగోలు చేస్తామని వ్యాపారులు అంటున్నారని రైతులు తెలిపారు. దీంతో కూలీల ఖర్చులు కూడా రాకపోవడంతో పంటను పొలాల్లోనే వదిలేశామని పలువురు రైతులు తెలిపారు. కొంతమంది రైతులు స్థానిక వ్యాపారులను బ్రతిమిలాడుకొని ఎంతో కొంత ఇవ్వండని తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. అనేక వ్యయ ప్రయాసాలతో పంటను సాగు చేస్తే పెట్టుబడి కూడా చేతికి రాలేదని, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడిగేనాథుడే లేడు



నేను రూ.4 లక్షలు ఖర్చుతో నాలుగున్నర ఎకరాల్లో క్యారెట్ సాగు చేశాను. పంట దిగుబడి బాగా వచ్చింది. అయితే పంట కొంటామని అడిగేనాథుడే లేడు. దీంతో పంట కోసం పెట్టిన పెట్టుబడి మొత్తం నష్టపోయాను. చేసేది లేక పంటను పొలంలోనే వదిలేశాను.

– అమర్‌నాథ్‌రెడ్డి, రైతు, ఉప్పార్లపల్లి, తనకల్లు మండలం

ఐదు ఎకరాల్లో సాగు చేశా



నేను ఐదు ఎకరాల్లో క్యారెట్ సాగు చేశా. మొదట్లో ధరలు బాగా ఉండడంతో ఖర్చులు పోనూ రూ. ఐదారు లక్షలు లాభం వస్తుందనుకున్నాను. కానీ ధరలు పడిపోయాయి. ప్రస్తుతం వ్యాపారులు కిలో రూ. 3కు అడుగుతున్నారు. దీంతో కూలీల ఖర్చు కూడా వెనక్కి రాలేదు.

– సునీల్, రైతు, ఈతోడు, తనకల్లు మండలం

ఏ పంట సాగు చేసినా నష్టమే



నేను రెండు ఎకరాల్లో క్యారెట్‌ను సాగు చేశా. గతంలో వ్యాపారులే పొలం దగ్గరకు వచ్చి మంచి ధరకు కొనుగోలు చేసేవారు. ధర లేకపోవడంతో పంటను అలాగే వదిలేశా. క్యారెట్ సాగుతో రూ. 2 లక్షలు వరకు నష్టపోయాను. ఏ పంట సాగు చేసినా నష్టాలే మిగులుతున్నాయి.

– శంకర్‌రెడ్డి, రైతు, ఉప్పార్లపల్లి, తనకల్లు మండలం

ప్రజా సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి

తాడిమర్రి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా అధికారులు గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం మండలంలోని పలు శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా రామాపురం సర్పంచ్ పుల్లయ్య గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తీవ్రంగా తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాను చేస్తామని జేఈ తెలిపారు. వెలుగు ఏపీఎం సాంబశివుడు బోరు బావి, నీటి సౌకర్యం ఉన్న రైతులు పది సెంట్ల విస్తీర్ణం పైగా చేపల పెంపకం చేపడితే 35 శాతం సబ్సిడీతో రూ.4.40 లక్షలు రుణం మంజూరు చేయిస్తామన్నారు. ఉదయ్ ఆక్వా కంపెనీ వారు చేప పిల్లలను సరఫరా చేసి వారే కొనుకోలు చేస్తారన్నారు. ఏపీఓ సంజీవ రెడ్డి మాట్లాడుతూ సోక్ పిట్స్ ఏర్పాటు చేసుకున్న వారికి రూ.6 వేలను అందిస్తామన్నారు. పారంపాండ్లను నిర్మించుకునే రైతులకు 75 శాతంతో సబ్సిడీని అందిస్తామన్నారు. ఎంపీడీఓ వెంకటరంగారావు, ఈఓఆర్‌డీ విజయశేఖర్ నాయుడు, సీఎస్‌డీటీ శారద, వైస్ ఎంపీటీసీలు ఎర్రగంగు క్రిష్ణమనాయుడు, లింగమ్మ, ఏఓ రమాదేవి, పశువైద్యాధికారి సువర్ణ, ఎంఈఓ క్రిష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ దేవేంద్రనాయక్.

ఎన్పీకుంట: మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దేవేంద్రనాయక్ హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మండలంలోని వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూముల పరిరక్షణకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న దేవదాయ, పంచాయతీరాజ్, అటవీశాఖ, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా, ఇతరులు కబ్జా చేయకుండా గట్టి చర్యలు చేట్టాలన్నారు. మండల కేంద్రానికి సంబంధించి పెద్దచెరువు, దేవరచెరువు భూములతో పాటు గ్రామకంఠం భూములు ఆక్రమణకు, కబ్జాకు గురయ్యాయని, ఇది వరకే ఫిర్యాదులు అందాయని, వీటిపై మండల కమిటీ సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ చేసి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, ఎస్‌ఐ వలిబాషా, పీఆర్ జేఈ వరప్రసాద్, ఇరిగేషన్ ఏఏఈఈ మహేష్, అటవీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.




పుట్టపర్తి సమీపాన గులాబీ వర్ణంలో ఆకాశం



చినుకులు రాలడంతో మారిన వాతావరణం

మేఘాల సోయగం

పుట్టపర్తి రూరల్: ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్న తరుణంలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశంలో రంగురంగుల మేఘాలు కనువిందు చేశాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో జనంతోపాటు పశుపక్ష్యాదులకు కాసింత ఉపశమనం కలిగింది.



ఎనుములపల్లి చెరువు వద్ద దట్టంగా అలుముకున్న మేఘాలు

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి

చెన్నేకొత్తపల్లి: బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని యర్రోనిపల్లి గ్రామంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జూనియర్ సివిల్ జడ్జి హరిష్, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీల కుమారి, రామగిరి సీఐ శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలికలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చెన్నేకొత్తపల్లి మండలాన్ని బాలల సమస్యలు లేని మండలంగా చేయడానికి కృషి చేయాలని సూచించారు. అమ్మాయిలు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తే పోక్సో చట్టం ప్రకారం నేర తీవ్రతను బట్టి శిక్షలు ఉంటాయన్నారు. అనంతరం రీజనల్ డైరెక్టర్ ప్రమీల కుమారి మాట్లాడుతూ.. ఆర్డీటీ సంస్థ బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వ శాఖలతో కలసి అవగాహన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బాలాత్రిపుర సుందరి, చరణ్, హేమంత్, ఆర్డీటీ సిబ్బంది ఆదినారాయణ, శ్రీనివాసులు, శారద, మురళి, గీతావాణి, హెచ్‌ఎం మంజులావాణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

25న మెగా జాబ్‌మేళా

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని బ్లూమూన్ పాఠశాలలో ఈ నెల 25న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌మేళాకు 25 బహుళజాతి కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, డిప్లమో, బీ ఫార్మసీ, ఎంటెక్, నర్సింగ్ చదివిన అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు 9390176421 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

గాండ్లపెంట: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరగాల్సి ఉండగా కోరం లేక వాయిదా పడింది. సర్వసభ్య సమావేశానికి ఏడుగురు సభ్యుల్లో 4 గురు హాజరు కావాల్సి ఉండగా కేవలం వేపరాల ఎంపీటీసీ సోమశేఖర రెడ్డి హాజరయ్యారు. కోరం లేకపోవడంతో సమావేశాన్ని ఆదివారానికి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి విలేకరులకు తెలిపారు. కాగా మండలంలో 7 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వాటిలో 6 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందగా సోమయాజులపల్లి ఎంపీటీసీ స్థానంలో మాత్రమే టీడీపీ విజయం సాధించింది.

పీవీసీ పైపులకు దరఖాస్తు చేసుకోండి

నల్లమాడ: రాయితీ పీవీసీ పైపుల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల పరిషత్ అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి 13 పీవీసీ పైపులు యూనిట్లు మంజూరయ్యాయన్నారు. అర్హులైన రైతులు ఈనెల 24లోపు డీడీ, రైతు పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బీ, ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకం దరఖాస్తుతో పాటు అందజేయాల్సి ఉందన్నారు. వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఫారంపాండ్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: బాలప్పగారిపల్లిలో జాతీయ జల దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ పోలప్ప ఆధ్వర్యంలో ఉపాధి హామీ కింద ఫారంపాండ్ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీడీ రమేష్‌బాబు, ఏపీఓ హరూన్ రషీద్, ఈసీ శ్రీధర్ రెడ్డితో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కూలీలు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: అంతర్జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రానికి సమీపంలో రైతు సునీత పొలంలో ఫారంఫాండ్ పనులకు అధికారులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అశోక్‌నాయక్, ఏపీఓ గోవింద నాయక్, ఈసీ మంజునాథ్, టీఏ లింగమయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ అక్కులప్ప, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అదనంగా పరిహారం చెల్లించండి

ముదిగుబ్బ: మండలంలో 342 హైవేకు సంబంధించి గుంజేపల్లి, మంగళమడక, నక్కలపల్లి, దొరిగిల్లు గ్రామ రెవెన్యూ పొలాల్లో అదనంగా భూసేకరణ జరిగిందని, సదరు రైతులకు అదనంగా పరిహారం చెల్లించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం మండల కార్యదర్శి బండల వెంకటేష్, పోతులయ్య, బాబ్జాన్, బాబు, నాగప్ప, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శారదానగర్‌లో ఫాగింగ్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శారదానగర్‌లో శనివారం రాత్రి మున్సిపల్ సిబ్బంది దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. దోమల బెడద ఎక్కువగా ఉండటంతో రోజూ ఒక్కో వార్డు చెప్పున అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేయిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు.

పోలీసుల ‘పల్లె నిద్ర’

కదిరి అర్బన్: కే. బ్రాహ్మణపల్లిలో శనివారం రాత్రి కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి తన సిబ్బందితో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మిస్సింగ్ కేసులు, మహిళల భద్రతపై అవగాహన కల్పించారు.

నేడు దివ్యాంగులకు వైద్య శిబిరం

ధర్మవరం రూరల్: ధర్మపురి గ్రామంలో ఆదివారం దివ్యాంగులు, వృద్ధుల కోసం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు పోలా ప్రభాకర్, సీనియర్ రెడ్‌క్రాస్ ప్రతినిధి డాక్టర్ సత్య నిర్ధారన్, అధ్యక్షుడు షీలా నాగేంద్ర శనివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు.

25న వారపు సంత, షాపింగ్ రూముల వేలం

తనకల్లు: మండల కేంద్రంలో నిర్వహించే వారపు సంతతో పాటు స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉన్న రెండు షాపింగ్ రూములకు ఈ నెల 25న వేలం పాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి కృష్ణమూర్తిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ. 10 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే ఈ నెల 26న కొక్కంటిక్రాస్‌లో నిర్వహించే వారపు సంతకు వేలం పాట నిర్వహిస్తామని కార్యదర్శి ఆంజనేయులు పేర్కొన్నారు. వివరాలకు ఆయా గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

నాటుసారా జోలికెళ్లొద్దు

ముదిగుబ్బ: నాటుసారాతో జీవితాలు నాశనమవుతాయని, దాని జోలికెళ్లొద్దని ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద్‌నాయక్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహులు, సీఐ చంద్రమణి ప్రజలకు సూచించారు. శనివారం గుడ్డంపల్లి తండాలో నాటుసారాతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. నాటుసారా తాగినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఎస్‌ఐలు చాంద్‌బాషా, నాగరాజు, ఏఎస్‌ఐ నాగభూషణ. వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, పంచాయితీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి పైకప్పు మరమ్మతు



ఎమర్జెన్సీ గది పైకప్పునకు మరమ్మతు చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

ధర్మవరం అర్బన్: ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి పైకప్పునకు మరమ్మతులు చేశారు. జనవరి 8న సాక్షిలో ‘ఆస్పత్రిలో భయం .. భయం!’ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ స్పందించారు. పైకప్పు పెచ్చులూడిన ప్రాంతంలో సిమెంట్‌తో ప్లాస్టరింగ్ చేశారు. ఆసుపత్రి సిబ్బందితోపాటు రోగులు సంతోషం వ్యక్తం చేశారు.

ఏపీయూఎస్ నూతన కమిటీ ఎన్నిక



డైరీని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి

కదిరి అర్బన్: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి నివాసంలో శనివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) కదిరి డివిజన్ కన్వీనర్ శ్రీరామ్‌నాయక్ ఆధ్వర్యంలో ఎన్పీకుంట మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి రాజేంద్రప్రసాద్, జిల్లా అధ్యక్షుడు అమరాచంద్రబాబు హాజరయ్యారు. అధ్యక్షుడిగా చిన్నరెడ్డెప్ప, ప్రధాన కార్యదర్శిగా మోహన్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా వీరారెడ్డి, కమల, శివప్రసాద్, తనూజ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏపీయూఎస్ డైరీని మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి ఆవిష్కరించారు.

ఘనంగా గ్రీన్ డే



గ్రీన్ డేలో పాల్గొన్న విద్యార్థులు

ముదిగుబ్బ: స్థానిక పీవీఎస్ పాఠశాలలో శనివారం గ్రీన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పీవీ నాయుడు మాట్లాడుతు చిన్న పిల్లలకు రంగుల ప్రాధాన్యతపై నర్సరీ నుంచే అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా ఆకుపచ్చ రంగు అత్యంత ప్రాధాన్యత కలిగినదని తెలియజేశారు.